క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

హుజూరాబాద్: పరిసరాల శుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరవని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. వార్డు కౌన్సిలర్ ఉమామహేశ్వర్, కమిషనర్ సమ్మయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సత్యం తదితరులు ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



జమ్మికుంట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: ఎస్సీ వర్గీకరణ సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ పిలుపునిచ్చారు. మండలంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. 10న కరీంనగర్ పట్టణంలోని పద్మానగర్ ఇందిరా గార్డెన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ దేశంలో షెడ్యూల్ కులాలకు సమన్యాయం జరిగేలా రాజ్యాంగంలో రిజర్వేషన్లతో హక్కులు కల్పించారని, మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రజాసంఘాల జేఏసీ కార్యదర్శి సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, వేణు, కార్యదర్శి సతీష్, మండల నాయకులు అరుణ్‌కుమార్, రవీందర్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఎస్సీ వర్గీకరణ సదస్సు కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొజ్జ రవి, కోండ్ర రాజయ్య, దేవునూరి కిష్టయ్య, శంకర్, శ్రీనివాస్, సతీష్, ఓదెలు తదితరు లు ఉన్నారు.

నేత్రదానంపై ర్యాలీ

జమ్మికుంట: పట్టణంలోని 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు నరహరి, యోగాసాధన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంతో అంధులకు చూపునిద్దామని, అవయవదానంతో పునర్జన్మ ప్రసాదిద్దామని పిలుపునిచ్చారు. కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. వెంకటేశ్వర్లు, బచ్చు భాస్కర్, వీరేశలింగం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో చీడల నివారణపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో శుక్రవారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పత్తి పంటలో చీడల నివారణకు పలురకాల కషాయాలపై రైతులకు అవగాహన కల్పించారు. వావిల, వేప వంటివి తయారు చేసుకొని పంటలపై వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు మాధవి రైతులు పాల్గొన్నారు.

హైడ్రాను విస్తరింపజేయాలి



తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రమిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

శంకరపట్నం: జిల్లాలకు హైడ్రాను విస్తరింపజేయాలని ముస్లిం జేఏసీ నాయకులు తహసీల్దార్ భాస్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆక్రమించుకున్న వక్ఫ్ భూములు, చెరువు, కుంటలను పరిరక్షించేందుకు హైడ్రాను హైదారాబాద్‌కే పరిమితం చేయకుండా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ మానకొండూర్ నియోజకవర్గం కన్వీనర్ రహీం, కోకన్వీనర్ ఆరీఫ్, సయ్యద్‌అబీబ్, మీర్జాఆరీఫ్‌బేగ్ తదితరులు ఉన్నారు.



చొప్పదండి: కాట్నపల్లిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



హుజూరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, గ్రీన్ కోర్ టీచర్

మట్టి వినాయకులను పూజిద్దాం – పర్యావరణాన్ని రక్షిద్దాం

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లిలో వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్ గన్ను రాజు గ్రామస్తులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పదేళ్లుగా గ్రామంలో ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు మట్టి విగ్రహాలను పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజిద్దామని సూచించారు.

జమ్మికుంట: రసాయనాలతో తయారుచేసిన గణపతి విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుందని ఆలయ ఫౌండేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ అన్నారు.

హుజూరాబాద్: మట్టి గణపతులను పూజించాలంటూ నేషనల్ గ్రీన్ కోర్ టీచర్ అనురాధ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో అంబేద్కర్ చౌక్ వద్ద ప్రచారం చేశారు. హెచ్‌ఎం సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు. పట్టణంలోని జమ్మికుంట రోడ్డులోని కన్యాకపరమేశ్వరి ఆలయ ఆవరణలో సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య నాయకులు మాడిశెట్టి వీరన్న, కొమురవెల్లి వీరన్న పాల్గొన్నారు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జిల్లా పరిషత్ సెకండరీ, గాగిరెడ్డిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి శుక్రవారం గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్లాస్టిర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను చెరువు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై జలచరాలు అంతమయ్యే ప్రమాదం ఉందని విద్యార్థులే మట్టి విగ్రహాలను తయారుచేశారని టీచర్లు తెలిపారు. హెచ్‌ఎంలు రాంచంద్రారెడ్డి, జయప్రద, ఉపాధ్యాయులు తిరుపతి, మంజుల, ప్రతాపరెడ్డి, చారి, వేణు, ఓదెలుకుమార్, మాధవి, సరిత, రఘుపతిరెడ్డి, పవన్‌కుమార్, సూర్యప్రకాశ్, నర్సింహస్వామి, అనురాధ, అనితకుమారి, ప్రేమలత, రవీందర్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి గ్రామంలో పంపిణీ చేశారు.

గంగాధర: మండలంలోని గర్షకుర్తిలో పర్యావరణాన్ని పరిరక్షించాలని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సరస్వతీ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలని నినాదాలు చేశారు. మిట్టపల్లి రాజశేఖర్, ఎ.శ్రీనివాస్, రమేష్, మల్లికార్జున్, టీచర్లు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మోడల్, శ్రీచైతన్య, పారమిత స్కూళ్లలోని విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి సృజనాత్మకతను చాటుకున్నారు. అనంతరం విగ్రహాలను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ ఆదిత్య, శ్రీచైతన్య ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, పారమిత చైర్మన్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



హుజూరాబాద్: మట్టి వినాయక విగ్రహాల పంపిణీ





చిగురుమామిడి: ఇందుర్తి జెడ్పీపాఠశాల, గాగిరెడ్డిపల్లిలో మట్టి గణపతులతో విద్యార్థులు



తిమ్మాపూర్: శ్రీచైతన్యలో...



గంగాధర:ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



శంకరపట్నం: విగ్రహాలతో మొలంగూర్ విద్యార్థులు

ఆలయ నిర్మాణం కోసం గ్రామసభ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జీపీ కార్యాలయం సమీపాన శ్రీహనుమాన్ దేవాలయం నిర్మాణానికి శుక్రవారం కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆలయం నిర్మించొద్దని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శిథిలావస్థకు చేరిన దేవాలయం పునఃనిర్మాణానికి కులసంఘాలు ముందుకురావడంతో సమస్య ఏర్పడింది. మాజీ సర్పంచ్ ఫిర్యాదుతో జిల్లా అధికారులు పలుమార్లు దేవాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మళ్లీ గ్రామసభను అధికారులు, పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించారు. గ్రామస్తులు జైశ్రీరామ్ అంటూ ఏకగ్రీవంగా దేవాలయం నిర్మాణం చేయాలని అభిప్రాయం తెలియజేశారు. గ్రామసభను అధికారులు వీడియో తీశారు. వివరాలను జిల్లా అధికారులకు తెలియజేయడం జరుగుతుందని ప్రత్యేకాధికారి తెలిపారు. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చొప్పదండి, రామడుగు ఎస్సైలు గొల్లపల్లి అనూష, శేఖర్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



గ్రామసభలో ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్

ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు



చిగురుమామిడి: ఇందుర్తి–కోహెడ మధ్య..



గన్నేరువరం: పనులను పరిశీలిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి–కోహెడ మధ్య మోయతుమ్మెద వాగుపై నిర్మించిన కల్వర్టు భారీ వర్షాలకు దెబ్బతినగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. హైలెవల్ బ్రిడ్జికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఇందుర్తి గ్రామస్తులు తెలిపారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది మార్గంలో లింగాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల కల్వర్టులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. వెల్ది గ్రామానికి చెందిన కొండయ్య, బాబురావు స్వచ్ఛందంగా జేసీబీతో రోడ్డును చదును చేయించారు.

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట పొత్తూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గుండ్లపల్లి రోడ్డు పనులను పార్టీ మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం ఆధ్వర్యంలో పరిశీలించారు. నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన

సాక్షి స్పందన

గంగాధర: పత్తి పంట నష్టంపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం పంటను పరిశీలించారు. 'వర్షం మిగిల్చిన నష్టం' అనే శీర్షికతో గంగాధర మండలంలో పత్తిపంట నష్టంపై జిల్లా పేజీలో కథనం ప్రచురితమైంది. వ్యవసాయ విస్తరణ అధికారి గోపిచంద్ హిమ్మత్‌నగర్ గ్రామంలో పంట దెబ్బతిన పత్తిపంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి తెగుల్ల నివారణకు సూచనలిచ్చారు.

కేడీసీసీబీ డైరెక్టర్‌గా అలువాల కోటి



ఎమ్మెల్యే కవ్వంపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న అలువాల కోటి

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, గునుకులకొండాపూర్ సహకార సంఘం డైరెక్టర్ అలువాల కోటి కేడీసీసీబీ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శుక్రవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం బేగంపేటలో నియామకపత్రం అందజేశారు. కోటి స్వస్థలం మండలంలోని పారువెల్ల గ్రామం కాగా 2020లో సహకార సంఘం డైరెక్టర్‌గా, నుస్తులాపూర్ సహకార సంఘం చైర్మన్‌గా, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్‌కు అలువాల కోటి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్సై బాధ్యతలు స్వీకరణ

రామడుగు: రామడుగు ఎస్సైగా బదిలీపై వచ్చిన వి. శేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్సై మామిడాల సురేందర్ కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా ఎస్సైకి సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ వైద్య శిబిరాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆబాది జమ్మికుంట, హనుమద్లపల్లిలో డాక్టర్ సంధ్యరాణి, గణేశ్‌నగర్‌లో డాక్టర్ మహోన్నత పటేల్, కొత్తపల్లి ఏరియాలో డాక్టర్ ఫర్హానుద్దీన్ వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితులకు రక్త నమూనాలు ల్యాబ్‌కు పంపించారు. మున్సిపల్ పరిధి మేడరివాడ, మండలంలోని నగురంలో డాక్టర్ చందన అంగన్‌వాడీల్లో పోషణ, సభలు నిర్వహించారు. రక్తహీనత, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులుపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, కౌన్సిలర్ విజయ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.



మానకొండూర్‌రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెల్ది–రంగపేట రోడ్డు గుంతలమయంగా మారింది. రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీఏఈ, సెల్ నం : 94408 18867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

సంక్షిప్త వార్తలు

● విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

సైదాపూర్: విద్యుత్ చౌర్యానికి చర్యలు తప్పవని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ గంగాధర్ హెచ్చరించారు. మండలంలోని గొడిశాలలో శుక్రవారం విద్యుత్ మీటర్ల దరఖాస్తుల స్వీకరణలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారందరికీ ఉచిత విద్యుత్ అవకాశం ఉన్నందున అందరూ కొత్త మీటర్లు తీసుకొని ప్రభుత్వ గృహలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● విధుల్లో చేరడంపై హర్షం

జమ్మికుంట: ఎస్సీ గురుకులాల్లో పదేళ్లుగా విధులు నిర్వహించిన పార్ట్‌టైమ్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇటీవల తొలగించారు. ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబల ప్రభాకర్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

● రజక సంఘం అధ్యక్షుడిగా సమ్మయ్య

సైదాపూర్: సైదాపూర్ గ్రామ రజక సంఘం అధ్యక్షుడిగా మునిగంటి సమ్మయ్యను మండల కేంద్రంలో కులస్తులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రామ్మూర్తి, కోశాధికారిగా మునిగంటి వెంకటేశ్, కార్యదర్శిగా చిన్న వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా గోపిరాజు సమ్మయ్యను ఎన్నుకున్నామని నూతన అధ్యక్షుడు సమ్మయ్య తెలిపారు.

● బ్రాహ్మణకుంటను కాపాడాలి

చొప్పదండి: చొప్పదండి పట్టణంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమి కబ్జాకు గురికాకుండా అడ్డుకోవాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణకుంట పక్కనే ఉన్న 301 సర్వే నంబర్‌తో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చెరువులో అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని కోరారు.

● నీటిగుంతల్లోకి చేపలు విడుదల

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని దుర్గా, అంబేడ్కర్ కాలనీలతోపాటు పలు వార్డులో వర్షపు నీరు నిల్వ ఉన్న నీటి గుంతల్లో మున్సిపల్ కమిషనర్ అయాజ్ ఆధ్వర్యంలో గంబూషియా చేపలను శుక్రవారం విడుదల చేశారు. విషజ్వరాలు, దోమల నివారణ, నీటి గుంతల్లో దోమ లార్వా పెరగకుండా గంబూషియా చేపలు విడుదల చేశామన్నారు.

● ఉత్తమ టీచర్‌కు అభినందనలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును కలెక్టర్ ప్రమేలా సత్పతి చేతుల మీదుగా అందుకున్నారు. శుక్రవారం రాధాకృష్ణను ట్రస్మా రాష్ట్ర నాయకుడు యాదగిరి శేఖర్‌రావు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

● అధికారులపై చర్యలు తీసుకోవాలి

గన్నేరువరం: గుండ్లపల్లి దేవుని చెరువులో కరీంనగర్ డెయిరీ భవన నిర్మాణానికి అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో మాట్లాడారు. చెరువులు, కుంటలు, కబ్జాకు గురవుతుంటే అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, మాదాపూర్ చెరువు కబ్జా చేసి రాముని ఆలయం నిర్మించుకునేందుకు అదే గ్రామానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు యత్నించారని తెలిపారు. దీనిపై తనతో పాటు కొమ్మెర రవీందర్‌రెడ్డి, మార్గం మల్లేశం అడ్డుకుని కోర్టును ఆశ్రయించామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే ఈ పరిస్థితులు వచ్చాయన్నారు. చెరువులు, కుంటలు గ్రామాలకు జీవనధారమని, వాటిని కాపాడుకుంటేనే భావితరాలకు మనుగడని, ఇప్పటికైనా చెరువులు, కుంటల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

● రామడుగులో కోతుల హంగామా

రామడుగు: మండల కేంద్రంలో శుక్రవారం కోతులు హంగామా సృష్టించాయి. ఓ వ్యక్తి ఇంట్లోకి రెండు కోతులు ప్రవేశించగా కుటుంబ సభ్యులు బయటకు పరుగుతీశారు. కోతులు లోపలికి వెళ్లగానే తలుపులు మూసుకొని గడియ పడింది. లోపల ఉన్న కోతుల అరుపులకు చుట్టు పక్కల నుంచి భారీ సంఖ్యలో కోతులు ఇంటిని చుట్టుముట్టాయి. గ్రామస్తులు కిటికీ ఊచలు తొలగించడంతో కోతులు బయటకు వచ్చాయి.

● బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి శివారు గొల్లపల్లి గ్రామం వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు వద్ద గండి పడింది. తాత్కాలిక మరమ్మతులు చేయడంతో బురదమయంగా మారింది. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ప్రయాణికులతో కల్వర్టు వద్దకు రాగానే బురదలో దిగబడింది. డ్రైవర్ ఎంత ప్రయత్నం చేసినా బస్సు ముందుకు కదలలేదు. దీంతో ప్రయాణికులను కిందకు దించగా బస్సు బురదలో నుంచి బయటకు వచ్చింది. కొద్దిసేపు వాహనాలకు అంతరాయం ఏర్పడింది. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కారు బురదలో దిగబడగా గేరుబాక్స్ పగిలిపోయిందని బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● వినాయకుడి పేరుతో వసూళ్లు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామ శివారులో వినాయకుడి చందా పేరుతో కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. లారీల వద్ద వసూళ్లు చేస్తుండగా గ్రామస్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వీడియో వైరల్ అయింది. చల్లూరు, కోర్కల్ గ్రామాల్లోని ఇసుక క్వారీల నుంచి ఇసుక తీసుకెళ్తుండగా లారీల నుంచి చందా పేరుతో వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది వసూళ్లు చేస్తున్న వారికి వార్నింగ్ ఇచ్చి వదిలేసినట్లు సమాచారం.

● అంధకారంలో మల్లారెడ్డిపల్లి

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో వీధిలైట్లు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. వినాయక చవితి నేపథ్యంలో వీధిలైట్లు లేక పోవడంపై శుక్రవారం ఎంపీవోకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పారిశుధ్యం, స్ట్రీట్‌లైట్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో గ్రామస్తులు మండిపడుతున్నారు.

● ఆర్థిక సాయం అందించాలి

చిగురుమామిడి: భారీ వర్షాలకు మండలంలో ఇళ్లు కూలిపోయినవారికి తక్షణ సాయంగా రూ.30 వేలు అందించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చిగురుమామిడిలో మాట్లాడారు. ఇందుర్తి–కోహెడ మధ్య మోయతుమ్మెద వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలన్నారు. రేకొండ–మొగిలిపాలెం, ఎక్లాస్‌పూర్ గ్రామాల మధ్య నిలిచిపోయిన బ్రిడ్జి పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు.

● ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఇల్లందకుంట: పెండింగ్ డీఏ విడుదల, పీఆర్సీ అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఇల్లందకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సాంబయ్య ఉద్యోగ విరమణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఉద్యోగ విరమణ వరకు నిబద్ధతతో పనిచేశారని జిల్లా, మండల బాధ్యులు అన్నారు. మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీటీఎఫ్ నాయకులు నరహరి, తిరుపతి, ఏబూసి శ్రీనివాస్, సదానందం, సీహెచ్.వేణు, సంపత్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, రవి, మురళి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శంకరపట్నం: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ అన్నారు. కొత్తగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆద్వర్యంలో పోషణమాసోత్సవాలు నిర్వహించారు. మొలంగూర్‌లో తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల, కొక్కెరకుంట గ్రామాల్లో శుక్రవారం సభను నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాశ్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొవాలని సూచించారు.

చిగురుమామిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఖాజామొయినొద్దీన్ అన్నారు. చిగురుమామిడి, సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహించారు. చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద 52 రకాల వైద్య పరీక్షలు చేస్తారని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హుజూరాబాద్‌రూరల్: పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో సుగుణ సుగుణ అన్నారు. కందుగులఅంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టిన అరగంటలోనే ముర్రుపాలు పట్టాలన్నారు. ఆరు నెలలు నిండగానే ఆహారం ఇవ్వాలన్నారు.

గన్నేరువరం: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రామానుజాచారి అన్నారు. జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో మాట్లాడారు.

సైదాపూర్: మండలంలోని గొల్లగూడెం, పెరుకపల్లి, వెన్కెపల్లి–3 అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు.

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంటలో పోషకాహారంపై అవగాహన సభ నిర్వహించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు.



తిమ్మాపూర్: రేణికుంటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానకొండూర్ రూరల్: మండలంలోని జగ్గయ్యపల్లి, గట్టుదుద్దెనపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. తల్లిపాల ఆవశ్యకత, నార్మల్ డెలివరీ గూర్చి వివరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐపీఆర్‌గా ప్రకటనలు
శ్రద్ధాంజలి, నివాళులు, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : రమేష్, ACO - 7997958214
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899